క్లుప్తంగా

మహా సంస్థానం హుండీ ఆదాయం రూ.18.06 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

పిఠాపురం: పట్టణంలో ప్రముఖ దత్త క్షేత్రమైన శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానానికి హుండీల ద్వారా రూ.18,06,729 ఆదాయం సమకూరినట్టు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డెం జనార్ధనరావు తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు వి.ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం హుండీలను తెరచి లెక్కించారు. గతేడాది నవంబర్ 25 నుంచి మంగళవారం వరకూ రూ.18.06 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు చక్కా దత్త చలపతి, గోసి రమణమ్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

19న సకల కళల ప్రదర్శనలకు ఎంపిక

సామర్లకోట: పట్టణంలోని సకల కళా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం పలు కళల ప్రదర్శన పోటీలకు ఎంపిక నిర్వహిస్తున్నట్టు సకల కళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, బడుగు సీతారామరాజు, జి.రాజు మాస్టారు, గౌరవ సలహాదారు, సినీ దర్శకుడు కేబీ ఆనంద్ తెలిపారు. మంగళవారం సాయంత్రం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 22న ఉగాది పర్వదినం సందర్భంగా సకల కళా సమాఖ్య ఆవిర్భావ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా 19న స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో నృత్య ప్రదర్శనలు, ఏకపాత్రాభినయం, పాటల పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. వీటిలో మూడు చొప్పున ఉత్తమ ప్రదర్శలను ఎంపిక చేసి ఉగాది రోజున ప్రదర్శించడంతో పాటు పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. ఈ మేరకు 22న బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో కూచిపూడి, భరతనాట్యం, ఏక పాత్రాభినయం, దేశ భక్తి గీతాలు, రంగ స్థల నాటకాలు, సినీ గానలహరి సాయంత్రం ఆరు గంటల నుంచి ప్రారంభిస్తున్నట్టు వివరించారు.

22 నుంచి ఉచిత నాట్య శిక్షణ శిబిరం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో ఈనెల 22 నుంచి ఉచిత నాట్య శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్నట్టు ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలకు కూచిపూడి నాట్యం, బాలురకు పేరిణీ శివతాండవాలను నాట్య గురువు బేతా సత్యనారాయణ నేర్పిస్తారని తెలిపారు. 22వ తేదీ ఉదయం ఆలయ చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభిస్తారని తెలిపారు. నాట్య శిక్షణ ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆరు గంటల వరకు ఉంటుందన్నారు. 10 నుంచి 16 ఏళ్లలోపు బాల బాలికలు అర్హులని చెప్పారు. వివరాలకు 94415 63253, 96528 70827, 98489 52474 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి: ప్రస్తుత వేసవి కాలంలో పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక పశువైద్యాధికారి పి.శ్రీమన్నారాయణమూర్తి సూచించారు. పశువులకు వడదెబ్బ తగలకుండా చూడాలన్నారు. మధ్యాహ్నం సమయంలో పశువులను నీడలో ఉంచాలని, పశువుల వెన్నుపూస, తలమీద చల్లని నీరు పోయాలన్నారు. ఉదయం, సాయంత్రం పాలు తీయడానికి అరగంట ముందు పశువులను శుభ్రంగా కడిగితే పాలు శాతం పెరుగుతుందన్నారు. వేసవి కాలంలో గేదెలకు ఎక్కువగా నీరు అందేలా చూసుకోవాలన్నారు. పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి



పవరలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలలిత

సామర్లకోట: ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని వారు వెంటనే పనులు ప్రారంభించాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత సూచించారు. మండల పరిధిలో పవర గ్రామంలోని జగనన్న లే అవుట్‌ను ఆమె పరిశీలించారు. గ్రామానికి మధ్యలో ఎంతో విలువైన స్థలాలు లభించడంతో లబ్ధిదారులు ముందుకు వచ్చి నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. గ్రామంలో 25 మంది నిర్మాణ పనులు ప్రారంభించలేదన్నారు. వారికి ఎంపీడీఓ కౌన్సిలింగ్ చేశారు. దాంతో లబ్దిదారులు ఇళ్ల పనులు ప్రారంభించడానికి ముందుకు వచ్చారని తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు మంగళవారం సీఐ కె.దుర్గాప్రసాద్ తన సిబ్బందితో దాడి చేశారు. ఎనిమిది మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.20,160, పేక ముక్కలు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

కోచ్ లేకుండా క్రీడా వికాసమా!



నిరుపయోగంగా క్రీడాకారుల విశ్రాంతి భవనం

- శిక్షకులు లేక నిరుపయోగంగా ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం
- ఉన్న ముగ్గురూ తలో చోటకు పయనం
- ఇన్‌చార్జి కోచ్ అరకొర సేవలతో అవస్థ
- కుంటుపడుతున్న క్రీడా నైపుణ్యం



కోచ్‌లు లేక వెలవెలబోతున్న ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం

సామర్లకోట: గురువు లేని విద్య గుడ్డి విద్య అంటారు పెద్దలు. ఎన్ని వసతులు ఉన్నా, ఎన్ని నిధులు వెచ్చించినా శిక్షకులు లేకపోతే ఏ విద్యా రాణించదు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం పరిస్థితి అదే. రూ.2.10 కోట్లతో ఇండర్ స్టేడియం నిర్మించి షటిల్ బ్యాడ్మింటన్, జిమ్, యోగాలకు అవసరమైన ఏర్పాట్లతో పాటు, కబడ్డీ ఖోఖో, బాస్కెట్‌బాల్ కోర్టులను ఏర్పాటు చేశారు. ఆటలు నేర్చుకోవడానికి వచ్చే యువతీ, యువకులకు శిక్షణ ఇవ్వడానికి ఇద్దరు మహిళలను, ఒక పురుష కోచ్‌లను నియమించారు. పురుష కోచ్ ఇటీవల పదవీ విరమణ చేయగా, ఖోఖో శిక్షణ ఇచ్చే కృపావతి సచివాలయంలో మహిళా పోలీసు జాబ్ రావడంతో ఆమె వెళ్లిపోయారు. మహిళా కబడ్డీకి శిక్షణ ఇచ్చే మరో కోచ్ శ్వేతను కాకినాడ డీఎస్‌ఏ మైదానానికి బదిలీ చేశారు.

కబడ్డీకి పుట్టినిల్లు సామర్లకోట

కబడ్డీకి పుట్టినిల్లుగా సామర్లకోటకు పేరు. ఆ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు శిక్షణ ఇచ్చేవారు లేకపోవడంతో ఇన్‌చార్జి కోచ్‌గా గోపి అనే శిక్షకుడిని నియమించారు. ఆయన మూడు రోజులకు ఒకసారి మొక్కుబడిగా వస్తున్నారు. ఈ నేపథ్యంలో శాశ్వత కోచ్‌ల విషయం పక్కన పెడితే, పట్టణంలోని పాఠశాలల పీడీలను ప్రతి రోజూ ఒక గంటైనా వచ్చి ఆయా క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ప్రతిరోజూ క్రీడా వికాస కేంద్రానికి వస్తున్నాం



యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో క్రీడా మైదానం లేక పోవడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల స్టేడియంలో కబడ్డీ శిక్షణ పొందుతున్నాం. ఆరు నెలలుగా కోచ్‌లు లేక పోవడంతో శిక్షణ లేదు.

– వి.భువనేశ్వర్, 9వ తరగతి, వైఏఎంహెచ్ఎస్, సామర్లకోట

క్రీడా వికాస కేంద్రంతో మంచి క్రీడాకారులు



వివిధ పాఠశాలల విద్యార్థులు ఇక్కడి కేంద్రంలో కబడ్డీ, ఖోఖో, బాస్కెట్ బాల్, షటిల్ బ్యాట్మింటన్‌కు శిక్షణ ఇస్తున్నారు. కొంత కాలంగా కోచ్‌లు లేరు. సామర్లకోటలో ఖోఖో, కబడ్డీ క్రీడాకారుల కోసం కోచ్‌లను నియమించాలి.

– తాళ్లూరి వైకుంఠం, పీడీ, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, సామర్లకోట

పరిపూర్ణ ఆరోగ్యానికి ఆల్బెండజోల్



కొత్తపల్లిలో విద్యార్థినులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది



వాకతిప్ప హైస్కూల్‌లో విద్యార్థినికి మాత్ర వేస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు



సామర్లకోట హైస్కూల్‌లో విద్యార్థినులకు మాత్రలు ఇస్తున్న ఎంఈఓ, డాక్టర్ జ్యోతి



పెద్దాపురంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబెట్లు వేస్తున్న డాక్టర్ సుదీప్తి

- ఘనంగా నులిపురుగుల నివారణ దినోత్సవం
- 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు మాత్రల పంపిణీ

కొత్తపల్లి: మండలవ్యాప్తంగా మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. గ్రామాల్లోని 1 నుంచి 19 ఏళ్ల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మౌనిక ఆధర్యంలో ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలకు వెళ్లి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

రక్తహీనత నివారణకు విద్యార్థులు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని డాక్టర్ మౌనిక సూచించారు. నాగులాపల్లి, కొమరగిరి పీహెచ్‌సీల ఆధ్వర్యంలోనూ పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

ఆరోగ్య సమాజం కోసం ఆల్బెండజోల్

సామర్లకోట: నులి పురుగులను నివారించి ఆరోగ్యవంతమైన పిల్లలను తయారుచేద్దామని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య పిలుపు నిచ్చారు. మండల పరిధిలో వివిధ పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో ఆయన మాట్లాడుతూ పిల్లలు, కిషోర బాలికల ఆల్బెండజోల్ 400 ఎంజీ టాబ్లెట్ వేసుకొవాలని సూచించారు. అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టరు జ్యోతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ తీసుకోవాలి

పెద్దాపురం: ప్రతి విద్యార్థి ఆల్బెండజెల్ ట్యాబ్లెట్ వేసుకోవాల్సిందేనని పీపీ యూనిట్ వైద్యులు ఎస్. సుదీప్తి, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆయా పాఠశాలల విద్యార్థులకు వారు ట్యాబ్లెట్లను వేశారు. పాఠశాల ఉపధ్యాయులు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణమండపంలో మెరుగైన వసతులు



సామర్లకోటలోని రైల్వే కల్యాణ మండపం

సామర్లకోట: స్థానిక రైల్వే కల్యాణ మండపంలో వినియోగదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్వాహణ కమిటీ తీర్మానించింది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం రైల్వే ఏడీఈఎన్ బి.శివప్రసాద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ విలేకర్లతో మాట్లాడుతూ రైల్వే కల్యాణ మండపంలో ఏసీ సదుపాయం కల్పించాలని, పెయింటింగ్స్ వేయించాలని, లోపల, బయట స్వల్ప మరమ్మతులు, సుందరీకరణలు చేయాలని తీర్మానించారు. కల్యాణ మండపంలో లోపాలను విజయవాడ సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారికి నోట్ తయారు చేసి పంపుతామని ఏడీఈఎన్ శివప్రసాద్ తెలిపారు. సీనియర్ సెక్షన్ ఇంజినీరు రవికాంత్, ఆఫీసు సూపరింటెండెంట్ రాము, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు పాల్గొని ప్రైవేటు కల్యాణ మండపాలకు దీటుగా రైల్వే కల్యాణ మండపాన్ని తీర్చి దిద్దాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



తలకు బలమైన గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

పిఠాపురం: 216వ నంబర్ జాతీయ రహదారిపై రాపర్తి జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ముగ్గురి వ్యక్తులకు గాయాలయ్యాయి. పిఠాపురం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ వైపు నుంచి మోటారు సైకిల్‌పై ఇద్దరు భార్యాభర్తలు వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న మరో మోటారు సైకిల్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రెండు మోటారు సైకిళ్లపై ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. వారిలో వెనుక మోటారు సైకిల్‌పై ఉన్న గుర్తుతెలియని వ్యక్తి తలకు బలమైన గాయాలు కావడంతో అతడిని హైవే పోలీసులు 108లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ముందు బైక్‌పై వెళుతున్న భార్యాభర్తలకు స్వల్ప గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం వారిని ఇంటికి పంపించేశారు. పిఠాపురం పట్టణ ఎస్సై జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

- రూ.3 లక్షల ఆస్తినష్టం



ప్రత్తిపాడులో బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సీఐ కిషోర్‌బాబు

ప్రత్తిపాడు: గ్రామంలో సోమవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. ప్రత్తిపాడు జాతీయ రహదారి సమీపంలోని నిమ్మకాయల మధులత, జిమ్ము అంబికాదేవి కుటుంబాల వారు తాటాకింట్లో నివసిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాంపించారు. దీంతో బాధితులు పిల్లలను తీసుకుని, బయటకు పరుగుపెట్టారు. ఆ సమయంలోనే రెండు గ్యాస్ సిలెండర్లు పేలడంతో ఇంటికి మంటలు వేగంగా వ్యాపించాయి. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. సమస్తం కాలి బూడిదకావడంతో రెండు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. స్థానిక అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎంజీ రత్నరాజు, తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు అగ్నిమాపక సిబ్బంది అంచనా చేశారు.

పోలీసుల ఉదారత

అగ్నిప్రమాదానికి గురైన ఇంటిని మంగళవారం ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు, ఎస్సై ఎం. పవన్‌కుమార్ సందర్శించారు.బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితులకు 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, దుస్తులను సీఐ కిషోర్ బాబు అందజేసి ఉదారతను చాటుకున్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. సామర్లకోట మండలం వెంకటకృష్ణరాయపురం గ్రామానికి చెందిన కరణం ఆదినారాయణ ఒమ్మంగిలో రెండు ఎకరాల్లో గడ్డిని రూ.10 వేలకు కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై తరలిస్తుండగా 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి మంటలు వ్యాపించాయి. దీంతో గడ్డి, ట్రాక్టర్ ట్రక్కు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ.1.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

సంపద కేంద్రాల నిర్వహణ మెరుగుపడాలి



చేబ్రోలులో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ విక్టర్

పిఠాపురం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ మరింత పెరగాలని, తద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి విక్టర్ సిబ్బందికి సూచించారు. గొల్లప్రోలు మండలంలో మంగళవారం ఆయన పర్యటించారు. చేబ్రోలులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పని తీరును పర్యవేక్షించారు. సంపద తయారీ కేంద్రాల్లో చెత్తను వేరు చేసి తయారు చేస్తున్న కంపోస్టు ఎరువును పంచాయతీ పరిధిలో పెంచుతున్న మొక్కలకు వినియోగించడంతో పాటు రైతులకు సరఫరా చేయాలని సూచించారు. సంపద తయారీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఏపీ మల్లవరంలో పర్యటించిన ఆయన ఇంటి పన్నుల వసూళ్లపై సిబ్బందిని ఆరా తీశారు. ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని, అన్ని గ్రామాల్లోనూ నూరు శాతం పన్నులు సకాలంలో వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, ఈఓపీఆర్డీ కుమార్ తదితరులు ఉన్నారు.

సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



మాధవపట్నంలో పంట కాలువను పరిశీలిస్తున్న వ్యవసాయ, నీటిపారుదల అధికారులు

సామర్లకోట: మండల పరిధిలో రబీకి సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు వ్యవసాయ శాఖ ఏడీఏ పద్మశ్రీ అన్నారు. మాధవపట్నంలో నీటి ఎద్దడి ఉన్నదనే ఫిర్యాదుల మేరకు పంట పొలాలను పరిశీలించారు. పంట కాలువ నుంచి నీరు మురుగు కాలువలోనికి వృథాగా పోతున్నట్టు గమనించారు. పొలాలకు సమీపంలో ఏలేరు కాలువ నుంచి నీరు ఉపయోగించుకునేలా మోటార్లు ఏర్పాటు చేసుకొవాలన్నారు. దీనికి అయిల్ ఖర్చును ఇరిగేషన్ శాఖ భరిస్తుందని ఏఈ నాగేశ్వరరావు తెలిపారు. అలాగే వేరుశనగ పంట పూర్తి కావడంతో ఆ పంటకు గరువు కాలువ గుండా అందే నీటిని వరి పొలాలకు మళ్లించేలా చూడాలని రైతులు కోరారు. ఏడీఏ మాట్లాడుతూ రబీ సాగుకు ఈ-క్రాప్ నమోదు పూర్తి అయిందన్నారు. ఈ మేరకు ఆర్బీకేలో ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఏఓ ఐ.సత్య, ఏఈఓ ఎంపీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన సేవలు అందించాలి



కరెళ్ల గణపతిరావును సత్కరిస్తున్న డాక్టర్ పాండురంగారావు

తుని: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో బీహెచ్ఎంపీఎలు కీలక పాత్ర పోషించాలని డాక్టర్ చిలుకోటి పాండురంగారావు సూచించారు. మంగళవారం మార్కండ్రాజుపేట మెడిలింక్స్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లో బేసిక్ హెల్త్‌కేర్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా న్యూఢిల్లీకి చెందిన సంస్థ నుంచి ఇటీవల డాక్టరేట్ అందుకున్న బీహెచ్ఎంపీఏ రాష్ట్ర అధ్యక్షుడు కరెళ్ల గణపతిరావు, రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ తెలగం శెట్టి రమేష్‌బాబులను గ్రామీణ వైద్యులు సత్కరించారు. డాక్టర్ అనూష, టి.చంద్రమౌళీశ్వరరావు, నేరెళ్ల సత్యనారాయణ, ఖాధర్, డి.సత్యనారాయణ, మల్లాది ఈశ్వరరావు, యండవల్లి నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో తనిఖీలు



గోకవరం ప్రభుత్వాస్పత్రి ఆవరణను పరిశీలిస్తున్న స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ రమేష్

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ వైద్యులకు సూచించారు. గోకవరం ప్రభుత్వాస్పత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ప్రధానమంత్రి నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా ఇద్దరు టీబీ వ్యాధిగ్రస్తులకు గ్రామానికి చెందిన గంగిశెట్టి బాలకోటేశ్వరరావు సహకారంతో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎం.వసుంధర, డాక్టర్ వనజాకుమారి, డాక్టర్ ప్రదీప్‌సుందర్, కాయకల్ప టీం సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారి గుండెకు సంఘమిత్ర అభయం



ప్రవల్లిక తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందజేసిన సంఘ మిత్ర, వైఎస్సార్ సీపీ నాయకులు

సామర్లకోట: మండల పరిధిలోని మాధవపట్నం శివారులోని జమునానగర్‌లో చిన్నారి ప్రవల్లిక (9)కు గుండె శస్త్ర చికిత్సకు స్థానిక సంఘమిత్ర సేవా సంఘం రూ.1,40,500 అందజేసి ఔదార్యం చాటుకుంది. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ (బుజ్జి) సంఘ మిత్ర అధ్యక్షుడు ఎండీ ఖాజా, గ్రామ వార్డు సభ్యుడు తోలెం లోవరాజు మంగవారం ఈ మొతాన్ని చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. చిన్నారి చికిత్సకు ఆర్థిక స్తోమత లేని జి.చెల్లారావు కుటుంబానికి శస్త్ర చికిత్సకు ఈ సాయంతో పాటు, రూ.లక్ష బాలిక పోషణార్థం ఎల్ఐసీ బాండ్‌గా గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. సంఘ సభ్యులు చోటుబాబు, హిమంత్ తదితరులు పాల్గొన్నారు. మాదవపట్నం వలంటీర్లు తమకు సహకరించారని సంఘ మిత్ర సభ్యులు వారిని అభినందించారు.

రైతులకు 40 శాతం రాయితీపై డ్రోన్లు

ప్రత్తిపాడు: వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు 40 శాతం రాయితీపై డ్రోన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని మండల వ్యవసాయశాఖాధికారి యింటి వీర గంగాధర్ మంగళవారం తెలిపారు. ఐదుగురు రైతులతో కూడిన సంఘానికి ఈ డ్రోన్లు మంజూరు చేస్తారన్నారు. పది లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ డ్రోన్ల ద్వారా పంటలకు సులభంగా పురుగు మందులు పిచికారీ చేయవచ్చన్నారు. వీటిని వినియోగించడం సమయం, ఖర్చు ఆదా అవుతాయని తెలిపారు. ఆసక్తి కల రైతులు మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

150 మందికి వైద్య పరీక్షలు

తుని: స్థానిక రోటరీక్లబ్ హాలులో మంగళవారం ఉచిత గ్యాస్ట్రో లివర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు ప్రారంభించారు. గ్యాస్ట్రో డాక్టర్ గౌతమ్‌కుమార్ తుని పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 150 మందికి లివర్ స్కానింగ్, షుగర్, బీపీ పరీక్షలు చేసినట్టు తుని రోటరీక్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల సతీష్ తెలిపారు. డాక్టర్లు ఎస్వీ సుబ్బారావు, సీహెచ్ శ్రీమన్నారాయణ, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సారాతో ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలో సోమవారం అర్ధరాత్రి అక్రమంగా సారా తరలించి, విక్రయిస్తుండగా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ పి.అశోక్ మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఇ.గోకవరం గ్రామానికి చెందిన పూజల సత్తిబాబు, మాడెం గణేష్ బైక్‌పై బురదకోట గిరిజన తండా నుంచి పది లీటర్ల సారాను తరలిస్తున్నట్టు సమాచారం అందింది. దీంతో ఎస్ఈబీ సిబ్బంది నిఘా ఏర్పాటు చేసి ఒమ్మంగి గ్రామ రామాలయం వద్ద సత్తిబాబు, గణేష్ ఒమ్మంగి గ్రామానికి చెందిన కొప్పన అప్పారావుకు సారా విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ముగ్గురినీ అరెస్టు చేసి, వారి నుంచి బైక్, సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ దాడిలో స్థానిక ఎస్ఈబీ ఎస్సై ఆర్. మోహన్‌రావు, సిబ్బంది కృష్ణార్జున, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

అదానీ ఒప్పందాలు రద్దు చేయాలి

కాకినాడ సిటీ: అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలన్నీ రద్దు చేయాలని, ఆయనకు అప్పగించిన గంగవరం పోర్టుతో పాటు అదానీకి అప్పగించిన పోర్టులు, భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్యభవన్‌లో మోడీ, అదానీ అక్రమాలపై సీపీఎం రాష్ట్ర కమిటీ ప్రచురించిన మోదానీ పుస్తకాన్ని సీపీఎం నాయకులు ఎం.రాజశేఖర్, దువ్వా శేషుబాబ్జీ, కరణం ప్రసాదరావు, కె.వీరబాబు ఆవిష్కరించారు. మోదీ ప్రోద్బలంతోనే దేశ సంపదను అదానీ లూటీ చేసి సంపన్నుడిగా ఎదిగాడని పేర్కొన్నారు.